క్లుప్తంగా

శాఖాహారాన్ని అలవర్చుకోండి



గుడివాడ టౌన్: మాంసాహారం మాని శాఖాహారాన్ని అలవర్చుకోవాలని మాస్టర్ శ్రీధర్ అన్నారు. గురువారం శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం నుంచి ఈ ర్యాలీ ప్రారంభమై పట్టణ పురవీధుల్లో కొనసాగి శ్రీ కృష్ణ ధ్యాన మందిరం వద్ద ముగిసింది. ప్రతిఒక్కరూ శాకాహారాన్ని ప్రోత్సహించాలని ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన కేంద్ర నిర్వాహకురాలు రాజకుమారి, ధ్యాన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్‌కూలర్ అందజేత

తోట్లవల్లూరు: పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హడ్కో ప్రాంతీయ కార్యాలయం(విజయవాడ) రీజినల్ చీఫ్ బీఎస్ఏ మూర్తి సూచించారు. స్వచ్ఛతాహీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా హడ్కో ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని గురివిందపల్లి మండల పరిషత్ పాఠశాల్లో పరిసరాల శుభ్రతపై ఆయన విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థుల సౌకర్యార్థం 80 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ప్యూరిఫై కూలర్‌ను అందజేశారు. సర్పంచ్ ఉదయభాస్కర్, పాఠశాల హెచ్ఎం ఉషారాణి పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న కొనకళ్ల, వెనిగండ్ల



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దసరా నవరాత్రుల సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గురువారం దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సన్మానించి అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. టీడీపీ నాయకులు వల్లభనేని వెంకట్రావు, బాబూరావు, పామర్తి అర్జున భాస్కరరావు, రామరాజు, రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

రాత్రిళ్లు ఇసుకరవాణా నిషేధం

తోట్లవల్లూరు: ఎడ్లబళ్లపై రాత్రి వేళలో ఇసుకరవాణాను నిషేధిస్తున్నట్లు ఎస్ఐ ఎం.అర్జునరాజు తెలిపారు. రాత్రి వేళల్లో ఎడ్లబళ్లపై ఇసుక రవాణ కారణంగా వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. భద్రిరాజుపాలెం వద్ద కృష్ణా కరకట్టపై గురువారం రాత్రి ఓ ఎడ్లబండిని ఢీకొని షేక్ బాజీ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. ప్రమాదాలను అరికట్టే చర్యలలో భాగంగా రాత్రి వేళ ఎడ్లబళ్లపై ఇసుక రవాణను నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు.

నాయకులపై దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం

పామర్రు: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పెగ్గెమ్ ప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్పీ నాయకులపై అక్రమంగా కేసులు బనాయించడం రాజ్యాంగ విరుద్ధం అని పేర్కొన్నారు. గత వారంలో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అంబేడ్కర్ చిత్రపటం ఉన్న ఫ్లెక్సీబేనర్ తొలగించేలా, కాకినాడ ఎంఎల్ఏ పంతం నానాజీ దళిత డాక్టర్‌పై దౌర్జన్యం చేసినా రాష్ట్ర ప్రభుత్వం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

అధికారుల సేవలు మరువలేనివి

పామర్రు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొన్ని ఏళ్లు అధికారులు అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న అధికారులకు గురువారం వీడ్కోలు సభను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, వెంకటనాంచారయ్య పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం కొండలమ్మ

కొండరాళ్లలో వెలసిన వేమవరం శ్రీ కొండలమ్మ కోరిన భక్తులకు కొంగు బంగారంగా మారారు. భక్తితో కొలవటంతో తృప్తి చెందక తమ ఇళ్లల్లో ఆ తల్లి పేరును అనుకున్నదే తడవుగా స్తుతించాలనే దృక్పథంతో కొండలమ్మను ఆ భక్తులు తలచుకుంటున్నారు. ఆ ఊరిలోనే కాదు చుట్టుపక్కల మండలాల్లో, వివిధ జిల్లాల్లో కూడా కొండా, కొండలమ్మ, కొండయ్య, కొండబాబు వంటి పేర్లతో ఆ దేవత పేరును తమ కడుపున పుట్టిన బిడ్డలకు పెట్టుకుంటున్నారు.

కొండరాళ్లలో వెలసిన అమ్మవారు




పుష్పాలంకార భూషితురాలైన అమ్మవారి మూలవిరాట్



కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: కృష్ణా జిల్లాలోనే శక్తి ఆలయాల్లో దేవదాయ లెక్కల ప్రకారం ఆదాయంలో ప్రాధాన్యతతో ఈ ఆలయం నమోదు అయింది. ఈ ఆలయానికి ప్రతి ఆదివారం కృష్ణా జిల్లా నుంచేగాక ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు చెల్లిస్తుంటారు. వారానికి 25–30 వేల మంది భక్తులు తల్లిని దర్శించుకుంటున్నారు. గురువారం కూడా అమ్మవారికి భక్తుల తాకిడి ఉంటుంది. సినీ నటులు, నిర్మాతలు, దర్శకులు, రాజకీయ నేతలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలు, రైతులు ఒక రంగమే కాదు అన్ని రంగాలకు చెందిన భక్తులు ఏం కోరుకుంటే అది అమ్మవారు తీరుస్తూ వారి నుంచి పూజలందుకుంటున్నారు కొండలమ్మ. 2005లో ఈ ఆలయాన్ని దేవదాయ శాఖ వారు స్వాధీనం చేసుకున్నారు. భక్తుల నుంచి ఏడాదికి దాదాపు రూ.ఒక కోటి కానుకల రూపంలో ఆదాయం వస్తుంది. అనేక మంది భక్తులు తమ పిల్లలను ఆ తల్లి పేరుతో భక్తిప్రపత్తులతో నిత్యం పిలుచుకుంటున్నారంటే అమ్మవారి పట్ల భక్తులకు ఉన్న విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం.



ఆనాడు కొండరాళ్లలో దొరికిన కొండలమ్మ నిజరూప విగ్రహమిదే

అమ్మవారికి పాలపొంగళ్ల సమర్పణ

కొండలమ్మ ఆలయానికి 40ఏళ్ల క్రితం చరిత్ర ఉంది. వేమవరంలో ఎంఎన్‌కే రహదారి పక్కనే దివాన్ సాహెబ్ కోడు మురుగు కాలువకు రివిట్‌మెంట్ కడుతున్నారు. ఆ గోడను కొండరాళ్లతో నిర్మిస్తుండగా వాటిలో ఒకరాయి అమ్మవారిని పోలినట్లుగా పని చేసేవారికి కనబడింది. ఆ రాయిని నిర్మాణంలో కలపకుండా పక్కన పెట్టారు. కొద్ది రోజులకు ఆ రాయిని రోడ్డు పక్కన నిలబెట్టి.. పసుపు, కుంకుమలు చల్లి భక్తులు పూజలు చేసేవారు. ఈ క్రమంలో అక్కడికి బాతులు పెంచుకునేవారు వచ్చారు. ఆ రాయి పక్కనే కుటీరం ఏర్పాటు చేసుకున్నారు. అమ్మవారి విగ్రహం పక్కనే ఉండటం వలన ఆ బాతులు విపరీతంగా గుడ్లు పెట్టేవని పెంపకందారులకు నమ్మకం ఏర్పడింది. ఆ బాతుల యజమానికి అనుకోని రీతిలో విపరీతమైన లాభాలు వచ్చాయి. సీజన్ పూర్తి కావటంతో ఆ బాతుల యజమాని గుంటూరు వలస వెళ్లటకు నిర్ణయించుకున్నాడు. బాతులను లారీలో వేసుకునేటపుడు వాటితో పాటు అమ్మవారి విగ్రహాన్ని కూడా తీసుకెళ్లారు. గుంటూరు వెళ్లగానే అక్కడ బాతులను కిందకు దించారు. వాటితో పాటు అమ్మవారిని దించగా వెంటనే బాతులు మొత్తం మృత్యువాతపడ్డాయి. వెంటనే అతను మళ్లీ అమ్మవారిని ఈ ప్రాంతానికి తీసుకొచ్చేశాడు. ప్రస్తుతం అమ్మవారు పూజలందుకుంటున్న స్థానంలోనే నిలిపాడు. ఈ విషయం చుట్టుపక్కల ప్రాంతాల్లో అనతి కాలంలో ప్రచారం జరిగింది. అప్పటి నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పాల పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు.

శోభాయమానంగా దసరా ఉత్సవాలు



ఏటా దసరా నవరాత్రుల్లో జిల్లా నలుమూలల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా విచ్చేస్తారు. తల్లి సన్నిధిలో ఏటా దసరా నవరాత్రి మహోత్సవాలు శోభాయమానంగా నిర్వహిస్తున్నాం. దుర్గాష్టమి రోజున కనకడప్పుల వాయిద్యాలు, బాణసంచా, చిత్ర విచిత్ర వేషధారణలతో చుట్టుపక్కలున్న గ్రామాల్లో అమ్మవారి భారీ ఊరేగింపు కొనసాగుతుంది. వేలాది మంది భక్తులకు అన్నసమారాధన ఆ రోజు ఉంటుంది.

– ఆకుల కొండలరావు, ఆలయ ఈఓ

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

తోట్లవల్లూరు: క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల బదిలీ అయిన ఎంపీడీఓ టి.స్వర్ణలత, డీటీ ధనలక్ష్మితోపాటు మరో 30 మంది పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖ ఉద్యోగులకు గురువారం సన్మానం చేశారు. ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో అధికారులను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ పెనుమత్స రాధిక, వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు గుర్తుండిపోవాలి

ముదినేపల్లి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు చేసిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన ఎంపీడీఓ పీ మల్లీశ్వరీ, ఏఓ రమణబాబు, ఈఓపీఆర్డీ లక్ష్మీనారాయణను గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో ఘనంగా సత్కరించారు.

పీఆర్ ఏఈకి సత్కారం

మొవ్వ: పంచాయితీ రాజ్ ఏఈ రామారావు పామర్రుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆయన్ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. నాగాయలంక మండలం నుంచి వాసుదేవరావు బదిలీపై మొవ్వకు రానున్నారు.

ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివి

గుడ్లవల్లేరు: సమస్యల పరిష్కారంపై సచివాలయ ఉద్యోగులు ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని గ్రామ కార్యదర్శి నరసింహారావు అన్నారు. స్థానిక సచివాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు బదిలీపై పలుచోట్లకు వెళ్లారు. వీరిని గురువారం నరసింహారావు ఘనంగా సన్మానించారు.

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జిల్లాలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే అమ్మవార్లకు అభిషేకాలు గావించి వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గుడివాడ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు



మామిళ్లపల్లిలో శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



పామర్రులో బాలాత్రిపుర సుందరీ దేవిగా కన్యకా పరమేశ్వరి



మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవిగా..



తటివర్రు రోడ్‌లో బాలాత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం(పెద్ద శివాలయం)లో అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనానికి ఉంచారు. గౌరీశంకరపురం లోని గౌరీశంకర స్వామి దేవస్థానం(చిన్న శివాలయం)లో అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనానికి ఉంచారు. స్థానిక వాసవీచౌక్‌లో వేంచేసియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ కన్యకా కుమారీదేవిగా అలంకరించారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో, సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్లను బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. మండలంలోని కొండిపర్రులోని భ్రమరాంబదేవి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. రాపర్ల గ్రామంలోని గణ్యశ్రీ వెంటేశ్వరస్వామి దేవస్థానంలోని శివాలయంలో అమ్మవారికి విశేష అలంకారాలను నిర్వహించారు.

మామిళ్లపల్లిలో..

పమిడిముక్కల: మండలంలోని మామిళ్లపల్లి గీతాశ్రమంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. గీతాశ్రమంలోని సరస్వతీదేవిని గురువారం శ్రీబాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మాతా సుజ్ఞానందగిరి అమ్మవారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలో దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండవల్లి, అయ్యవారిరుద్రవరం, పెరికెగూడెం, లింగాల, భైరవపట్నం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఈఓ దివ్యశ్రీ పూజలు చేశారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులు కనకదుర్గాప్రసాద్, బలరామకృష్ణ, శ్యాంప్రసాద్, రాంబాబు, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో ఈఓ కూచిపూడి శ్రీనివాసు ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీచక్రార్చన, లలితా సహస్ర నామ కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కైకలూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో వార్షిక శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కమిటీ అధ్యక్షుడు చొప్పర్ల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణమూర్తి, కోశాధికార బసవరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు

గుడివాడరూరల్: తటివర్రురోడ్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటరవికుమార్, ఈశ్వర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు. చిన ఎరుకపాడులోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్టీ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఏర్పాట్లు చేశారు.



కొండిపర్రులో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

శివగుళికమ్మకు పూజలు

మండవల్లి: ఇంగిలిపాకలంకలోని శివగుళికమ్మతల్లి ఆలయంలో గురువారం అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. గజ్జల వెంకటేశ్వరరావు, మధురమీనాక్షి దంపతులు పూజలు చేశారు.

కలిదిండిలో..

కలిదిండి(కైకలూరు): కలిదిండి మండలం గొల్లగూడెంలో దుర్గామల్లేశ్వరీ అమ్మవారి దసరా మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త మరీ వెంకటనాగులు గొల్ల పేరంటాలు పూజా కార్యక్రమాలు జరిపారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): దసరా శరన్నవరాత్రులును గురువారం నుంచి మొవ్వ మండలంలో అమ్మవారి భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పు శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారి ఆలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. లలితా సహస్ర నామార్చను పండితులు జోశ్యుల కార్తికేయ శర్మ నిర్వహించారు.



కైకలూరు శ్యామలాంబ ఆలయంలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో అర్చకుల ఆధ్వర్యాన ఆలయ నిర్వాహకులు పలు పూజలు నిర్వహించారు. సింగరాయపాలెం అమృతేశ్వరస్వామి ఆలయంలో ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ప్రారంభించారు. గురజ శివాలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవీగా అలంకరించి పూజలు చేశారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపురసుందరి దేవిగా గురువారం దర్శనమిచ్చారు. అర్చకుడు బాలాజీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

పెదపారుపూడిలో..

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని శ్రీనామేశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నరాత్రులు పురస్కరించుకుని పార్వతి అమ్మవారు బాలత్రిపురసుందరీ దేవిగా గురువారం భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా కొండలమ్మ



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా కొండలమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితుల వేద మంత్రోచ్చరణ నడుమ జరిగిన కలశస్థాపన పూజలను చేసిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వల్లభనేని వెంకట్రావు, బాబూరావు, కొడాలి రామరాజు, గరికపాటి రాంబాబు, జనసేన నేత పెన్నేరు రమేష్ పాల్గొన్నారు. కాగా అమ్మవారి అనివేటి మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వెళుతున్న ఎమ్మెల్యే రాము

సంక్షిప్త వార్తలు

భక్తులకు ఉచిత వైద్యం

గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో దసరా నవరాత్రులకు వచ్చే భక్తులకు ఉచిత వైద్యం అందజేస్తున్నారు. ఈ శిబిరాన్ని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు గురువారం ప్రారంభించారు. అవసరమైన భక్తులకు ఉచిత మందుల పంపిణీ చేపట్టారు.

వ్యక్తిపై దాడి

ముదినేపల్లి రూరల్: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనుమల్లి శివారు సింగారంనకు చెందిన బి.సాయి కోటేశ్వరరావుపై అదే గ్రామానికి చెందిన జి.వీరబాబు పాత కక్షల నేపథ్యంలో చాకుతో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా ఎస్ఐ డి.వెంకటకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగిన యోగా శిక్షణ

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో యోగా శిక్షణ కార్యక్రమాన్ని గురువారం కూడా కొనసాగించారు. ఆ కార్యక్రమ ఆర్గనైజర్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్కూల్‌కు కుర్చీల వితరణ

మండవల్లి: లోకుమూడి ఎస్సీవాడలోని అంగన్‌వాడీ స్కూల్‌కు గురువారం దాతలు కుర్చీలు బహూకరించారు. దాతలు జి విజయ్ కుమార్, ఎన్డీఏ నాయకులు రఫీ, బాషా, రమేష్, నాగసాయి, జైపాల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు భద్రత

గుడ్లవల్లేరు: దసరా ఉత్సవాలకు తమ పోలీసు శాఖ నుంచి పూర్తి స్థాయిలో భద్రతను ఇస్తున్నామని గుడ్లవల్లేరు ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ గురువారం తెలిపారు. ఆయన వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ సన్నిధిలో భక్తులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో పారిశుద్ధ్య కార్మికులకు హై 5 యూత్ గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ, పార్థసారథి దంపతుల ఆర్థికసాయంతో దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణా రాష్ట్ర సీఎస్‌సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పి.వి.పి.ఆంజనేయకుమారి చేతుల మీదుగా చేపట్టారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

యలమర్రు(పెదపారుపూడి): యలమర్రు పంచాయతీ కార్యాలయంలో పని చేసే కాంట్రాక్ట్ సిబ్బందికి గురువారం ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్, సర్పంచ్ కొల్లూరి అనూష చేతుల మీదగా నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి చైతన్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ ట్రస్టీగా సీతారాం

గుడ్లవల్లేరు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ట్రస్టీగా వల్లభనేని సీతారాం ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం తనను ఆలయ ట్రస్టీగా దేవదాయ శాఖాధికారులు ప్రమాణ స్వీకారం చేయించనున్నారని పేర్కొన్నారు.

6న ఉచిత వైద్య శిబిరం

కైకలూరు: స్థానిక ఓమౌజియా, ఓం నమోస్తుతే క్షేత్రం ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కైకలూరు వెంకటరమణ థియేటర్ ఎదుట ఎస్‌జీవోస్ హోంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, స్త్రీ సంబంధిత వైద్యం, జనరల్ సర్జరీ, ఎముకలు, కంటి, దంత వైద్యసేవలు డాక్టర్లు అందిస్తారని పేర్కొన్నారు.

అనారోగ్య సమస్యలు రాకుండా చర్యలు

పామర్రు: ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరి అన్నారు. స్థానిక సచివాలయం–1 వద్ద గ్రామ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఉప సర్పంచ్ బాలవెంకటేశ్వరరెడ్డి, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

జన సంచారం లేని ప్రదేశాల్లో పందులు పెంచుకోవాలి

మండవల్లి: జన సంచారం లేని ప్రదేశాల్లో పందులను పెంచుకోవాలని ఈఓపీఆర్డీ ఆనంద బాబు పేర్కొన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం పందుల పెంపకందారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, కార్యదర్శి కొండలు, పోలీసులు పాల్గొన్నారు.